


సిపిఎం పోరాట ఫలితం..

నేడు గిరిజనులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోని గిరిజన రైతులకు మంగళవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయనున్నారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం, ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ఎన్నో ఏళ్ల నుంచి పోరాటాలు సాగించారు. తహశీల్దార్ కార్యాలయం ముట్టడి, వంటావార్పు, తదితర నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్‌కు తహశీల్దార్, డిఆర్‌ఒ ఇచ్చిన హామీ మేరకు సర్వే ఆన్‌లైన్ కార్యక్రమాలు పూర్తిచేసి, పట్టాలు సిద్ధం చేశారు. వాటిని మంగళవారం కొండగంగుపూడిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు గిరిజనులకు అందజేయనున్నారు. దీంతో గిరిజనులు సిపిఎం, ఎపి రైతుసంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా..

మా ఇళ్లను కూల్చొద్దు



జెసిబికి అడ్డంగా చిన్నారితో నిలుచున్న మహిళలు

అధికారులను అడ్డుకున్న జమ్మయ్యపేట నిర్వాసితులు

ప్రజాశక్తి - భోగాపురం

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇళ్లను కూల్చేందుకు వెళ్లిన అధికారులను జమ్మయ్యపేట గ్రామానికి చెందిన విమానాశ్రయ నిర్వాసితులు సోమవారం అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త చోటుచేసుకుంది. పోలీసు బందోబస్తు మధ్య మంగళవారం అధికారులు ఇండ్లను కూల్చేందుకు జిఎంఆర్ సంస్థ ప్రతినిధులతో కలిసి జెసిబిలతో వెళ్లారు. ప్యాకేజీ ఇవ్వకుండా ఎలా కూలుస్తారంటూ మహిళలు ఇంటికి అడ్డంగా నిల్చున్నారు. దీంతో అక్కడ ఉన్న ఎస్‌ఐ సూర్యకుమారి మహిళలను బయటకు లాగేశారు. అయినప్పటికీ తగినంత పోలీస్ సిబ్బంది లేకపోవడంతో నిర్వాసితులను అడ్డుకోలేకపోయారు. దీంతో కొంత గందరగోళం నెలకొంది. మండలంలోని కొలువాడ పంచాయతీ జమ్మయ్య పేట గ్రామంలో ఆరు గృహాలు విమానాశ్రయం నిర్మాణ పరిధిలోకి వచ్చాయి. ఇందులో ముగ్గురికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని నిర్వాసితులు అంటున్నారు. దువ్వు పైడమ్మ అనే మహిళకు చెందిన ఇద్దరు కుమారులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పైడమ్మకు ఇవ్వలేదు. అలాగే బమ్మిడి రాము సూరమ్మ కుమారుడికి ఇచ్చి ఆమెకు ఇవ్వలేదు. దువ్వు కామమ్మకు ఇచ్చి ఆమె కుమారుడు సన్యాసప్పడికి ఇవ్వలేదు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చే సమయానికి సన్యాసప్పడికి రెండు, మూడు నెలలు వయసు సరిపోక పోవడంతో అప్పట్లో ఇవ్వలేదు. గత కొన్ని నెలల నుంచి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అధికారులతో పాటు విజయనగరం స్పందనలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ ఇవ్వలేదని వీరు ఆరోపిస్తున్నారు. ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే ఇల్లు కూల్చాలని వీరంతా అడ్డుకుంటున్నారు. ఒక ఇంట్లో 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని అధికారులు మా విషయంలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని వీరంతా ఆరోపిస్తున్నారు.

శివారెడ్డి రాకతో అమటంలో శాంతించిన రైతులు

ఎ.రావివలస రెవెన్యూ పరిధిలో అమటం వద్ద అదనపు భూమి సేకరణకు ఆర్‌డిఒ సూర్యకళ వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి అక్కడికి చేరుకున్నారు. 15 మంది రైతుల నుంచి భూమి సేకరించారు. దీంతో అక్కడ కొంత మంది రైతులు నిరాశ చెందడంతో వారికి ఎంతెంత వచ్చిందో రైతుల ముందే వివరించాలని శివారెడ్డి ఆర్డీవోను కోరారు. దీంతో ఆమె రైతులకు వచ్చిన పరిహారాన్ని వివరించడంతో అక్కడ ఎటువంటి వివాదం చోటు చేసుకోలేదు. దీంతో అధికారులు ఆ భూముల్లోని కొబ్బరి, తాటి చెట్లను తొలగించడం ప్రారంభించారు.

విమానాశ్రయ భూముల పరిశీలన

విమానాశ్రయ భూములను విజయనగరం డిఎస్‌పి ఆర్. గోవిందరావు సోమవారం పరిశీలించారు. గూడెపు వలస, కంచేరు, దిబ్బలపాలెం తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయనతో స్థానిక సిఐ బివి వెంకటేశ్వరరావు ఉన్నారు.





గాంధీ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి

మహనీయుల స్ఫూర్తితో సేవలందించాలి

గాంధీ, శాస్త్రి జయంతి వేడుకల్లో కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు తమ వద్దకు వచ్చే పేదలకు సేవలందించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ వారి విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి దేశానికి ఎన్నో విధాలుగా సేవలందించారని కొనియాడారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ సేవా దక్పథాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. ఆహార భద్రతను కాపాడటంలో లాల్ బహుదూర్ శాస్త్రి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆ మార్గంలో పయనించి ఇటీవల కన్నుమూసిన ఎంఎస్ స్వామినాథన్ కూడా దేశ ప్రజలకు ఎన్నోరకాలుగా సేవలు అందించారని, హరిత విప్లవం తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు.

బాపూజీ కన్న కలలు సాకారం

గ్రామ స్వరాజ్యం కోసం బాపూజీ కన్న కలలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గ్రామీణుల చెంతకే పరిపాలన వ్యవస్థను తీసుకువెళ్లి సుపరిపాలన అందిస్తున్నామని తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, సిఇఒ రాజ్‌కుమార్, డిపిఒ నిర్మలాదేవి, పలువురు జిల్లాపరిషత్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భావితరాలకు మార్గదర్శి : కోలగట్ల

మహాత్మా గాంధీ చూపిన స్ఫూర్తి భవిష్యత్ తరాలకు మార్గదర్శి అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని విటి అగ్రహారం పారిశ్రామిక శిక్షణ కేంద్రం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద నిర్వహించిన సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సన్మానించి నిత్యవసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ గిరి, వైసిపి యువజన విభాగం నాయకులు ఈశ్వర్ కౌశిక్, సంఘం రెడ్డి బంగారనాయుడు తదితరులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ విజయలక్ష్మి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిసిఎంఎస్ ఆధ్వర్యాన

మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని డిసిఎంఎస్ ఛైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైసిపి నాయకులు అవనాపు విక్రమ్.. గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా డిసిఎంఎస్ కార్యాలయంలో అవనాపు భావన విక్రమ్ దంపతులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి,నివాళ్లు అర్పించారు.

సత్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో గాంధీ జయంతి

సత్యా విద్యాసంస్థలు ఆధ్వర్యాన సోమవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ఆ సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు పూలమాలవేసి నివాళు లు అర్పించారు. గతనెల 25 నుంచి వారం రోజులు పాటు పలు కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. స్వచ్ఛభారత్, నగరంలోని గాంధీజీ విగ్రహాలను శుభ్రం చేయడం, ర్యాలీ, తమ పరిసరాలను పరిశుభ్రరా ఉంచుతామని ప్రతిజ్ఞ, గాంధీజీ విగ్రహాలను పూల మాలలు వేసి నివాళి అర్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి సాయి దేవ మణి, ఎన్‌సిసి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్యవేణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని

గాంధీ విగ్రహాలకు వినతులు



శృంగవరపుకోట.. గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా వ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రాష్ట్ర కార్యదర్శి వి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్షా, కెజిబివి లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ , పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖల్లో ఉద్యోగులను రెగ్యులర్ చేసి, మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచిందన్నారు. కానీ ఆరేళ్లగా సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచలేదన్నారు. కనీస వేతనాల కోసం ఇచ్చిన జిఒ లు అమలు చేయలేదన్నారు. ఈ నేపధ్యంలో గత నెల రోజుల నుండి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శృంగవరపుకోట : సమగ్ర శిక్ష, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్సు ఆవరణలో గాంధీ విగ్రహానికి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖలో ఉద్యోగులను రెగ్యులర్ చేసిందని, మినిమమ్ టైంస్కేల్ అమలు చేసి వేతనాలు పెంచారని తెలిపారు. ఆరేళ్ల నుంచి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచలేదని, నెలల తరబడి వేతనాలు పెండింగ్ ఉన్నాయని వాపోయారు. ఎంటిఎస్ కోసం ఇచ్చిన జిఒలు అమలు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. రవాణాఛార్జీలు, పని భారంతో ఉద్యోగులు అల్లాడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల నుండి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదని వాపోయారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోవడంతో జీవనం దుర్భరంగా మారిందన్నారు. గాంధీ ద్వారా ప్రభుత్వాన్ని తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామని తెలిపారు.

గాంధీ విగ్రహానికి వినతి

విజయనగరం కోట : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యాన ఆర్‌టిసి పిటిడి ఉద్యోగులు సోమవారం గాంధీ విగ్రహానికి వినతినిచ్చారు. ఈసందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు చోడవరపు వెంకట్రావు, సీనియర్ నాయకులు ఆర్.ఎ.నాయుడు, ఉపాధ్యక్షురాలు బి.లక్ష్మి మాట్లాడుతూ పిటిడి ఉద్యోగులకు వర్తింపజేస్తూ కొత్తగా విడుదల చేసిన జీవో 70 ద్వారా రూపొందించిన బానిస రెగ్యులేషన్‌ను సవరించాలని కోరారు. 1/2019 సర్క్యులర్ ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఉద్యోగులపై పెరుగుతున్న వేధింపులు ఆపాలన్నారు. లీవ్ ఎన్‌కేష్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి చంద్రయ్య, ఎం. సత్యం, పివిరావు, మహిళ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ప్రతిజ్ఞ



గాంధీ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల అమలుకు గాంధీ స్ఫూర్తితో ఉద్యమిస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎ.జగన్మోహన్‌రెడ్డి అఆన్నరు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో స్టేడియం పేట వద్ద గాంధీ జయంతిని నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు జి. కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి జగన్మోహన్ మాట్లాడుతూ అహింస, శాంతి నినాదంతో భిన్నత్వంలో ఏకత్వాన్ని పోరాట ఆయుధంగా మార్చి మహాత్మా గాంధీ ప్రజల్ని జాతీయ ఉద్యమంలో భాగస్వామ్యం చేశారన్నారు. అదే స్ఫూర్తితో పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రమ ఈశ్వరమ్మ అప్పయ్యమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఎ సోదాలు

ప్రజాశక్తి -బొబ్బిలిరూరల్

విజయనగరంజిల్లా బొబ్బిలి మండలం పిరిడి గ్రామంలో సోమవారం తెల్లవారు జామున 5.30 గంటలకు తూముల సింహాచలం అలియాస్ బాస్ ఇంటిలో ఎన్ఐఎ (హైదరాబాద్) పోలీసులు సోదాలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా రాడికల్స్ తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. దీనిలోభాగంగా సింహాచలం ఇంటిలో సోదాలు నిర్వహించారు. సింహాచలం గతంలో ప్రజానాట్యమండలిలో సభ్యుడిగా గా వున్నారు. అతని ఇంట్లో కొన్ని కర పత్రాలు, పుస్తకాలను, అతని సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని సిఆర్‌పిసి 160 కింద నోటీసు జారీ చేసి ఈ నెల 31న హైదరాబాద్ ఎన్ఐఎ ఆఫీసులో హాజరు కావాలని సూచించారు.

ప్రతి నెలా 2న విద్యుత్తు భద్రతా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలను అధికారులు, ఉద్యోగులు మరియు సిబ్బంది స్థానిక దాసనన్న పేట విద్యుత్ భవన్ లో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఇ ముువ్వల లక్ష్మణ రావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ వినియోగదారులకు మనమంతా మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. మేనేజ్‌మెంట్ ఆదేశాలకు అనుగుణంగా అన్ని ఆపరేషన్ సెక్షన్ కార్యాలయాల్లో ప్రతి నెలా 2న విద్యుత్ భద్రతా దినోత్సవం జరుపుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దాసన్నపేట సబ్ స్టేషన్‌లో డి2 సిబ్బందికి భద్రత పై అవగాహన కల్పించారు. టెక్నికల్ ఇఇ ధర్మరాజు, రూరల్ ఇఇ సురేష్ బాబు, కనస్ట్రక్షన్ ఇఇ త్రినాధ రావు, భోగాపురం డిఇఇ కెఎస్‌పి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

4న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

ప్రజాశకి-విజయనగరం టౌన్

అండర్ 19 (జూనియర్ కళాశాల) విభాగంలో ఈ నెల 4న హ్యాండ్ బాల్, 5న వాలీబాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు రాజీవ్‌క్రీడా ప్రాంగణంలో ఉదయం 9గంటలకు జరుగుతాయని అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జివిఎల్ఎన్ కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, 10 తరగతి మార్క్స్ లిస్ట్ ,పాస్ ఫోటోలు పట్టుకొని హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9885111375 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

జూనియర్స్ ఖో ఖో జిల్లా జట్ల ఎంపికకు విశేష స్పందన

ఈనెల తిరుపతిలో 20 21 22 తేదీల్లో జరగబోవు జూనియర్స్ ఖో ఖో ఛాంపియన్‌షిప్‌కు హాజరుకానున్న జిల్లా ఖోఖో జట్టుకు రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక జరిగింది. జిల్లా నుండి సుమారు 300 మంది పైగా క్రీడాకారులు హాజరయ్యారు. 18మంది చొప్పున బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ చిన్నంనాయుడు తెలిపారు. సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయులు బాలకృష్ణ, కమల, గోపాల్ సత్యనారాయణ , బైరెడ్డి శ్రీను, ప్రసన్న హాజరయ్యారు. అసోసియేషన్ కార్యదర్శి చింత సత్యనారాయణ పర్యవేక్షణలో ఎంపిక జరిగింది.

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో మల్లమ్మపేటకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ బరస్ట్ కావడంతో తాగునీరు వృథాగా పోతుంది. పైపులైన్ పగిలి పోవడంతో మంగళవారం తాగునీటి సరఫరా నిలిచిపోతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. పైపులైన్ బాగు చేసి తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. తాగునీటి సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

లాడ్జిల్లో సిసి కెమెరాలు తప్పనిసరి

ప్రజాశక్తి-విజయనగరం

నేరాల నియంత్రణలో భాగంగా లాడ్జిల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చెయ్యాలని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు అన్నారు. ఎస్‌పి ఆదేశాలతో లాడ్జి యజమానులతో సోమవారం వన్ టౌన్ పోలీసు స్టేషనులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ లాడ్జిలో బస చేసే వ్యక్తుల సమాచారం, ఆధార్ కార్డు, చిరునామా, ఫోను నంబరు వంటి వివరాలను తప్పనిసరిగా రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. నేరాలను నియంత్రించడంలో భాగంగా లాడ్జీలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వ్యక్తుల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వారు ఈ ప్రాంతానికి వచ్చి బస చేసే కారణం తెలుసుకోవాలని, అనుమానం ఉంటే సమాచారాన్ని పోలీసు స్టేషనుకు అందించాలని లాడ్జి యజమానులను కోరారు. నిబంధనలు అనుగుణంగా లాడ్జి యజమానులు వ్యవహరించకపోతే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ ఎస్.భాస్కరరావు, వి.అశోక్ కుమార్, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : అపరిచిత వ్యక్తులకు లాడ్జి గదులు అద్దెకు ఇచ్చేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు పరిశీలించాకే, కేటాయించాలని ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఉన్న పలు లాడ్జిల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇతర రాష్ట్రాల్లో పలు నేరాలకు పాల్పడిన, నేరారోపణలు ఎదుర్కొంటున్న కొందరు ఇక్కడకు వచ్చి తలదాచుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. అటువంటి వ్యక్తులకు లాడ్జిల్లో చోటు కల్పించరాదని హెచ్చరించారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అవకాశం కల్పించవద్దని సూచించారు.



లాడ్జి యజమానులతో మాట్లాడుతున్న వన్ టౌన్ సిఐ వెంకటరావు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు ● టిడిపి ఆధ్వర్యాన నిరసనదీక్ష



విజయనగరంకోట.. దీక్షా శిబిరం వద్ద గాంధీకి నివాళులర్పిస్తున్న అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ప్రజాస్వామ్యంతో సంబంధం లేని ప్రభుత్వం నడుస్తోందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. సోమవారం గాంధీ జయంతిని పురష్కరించుకుని స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నగరంలోని మూడు లాంతర్లు జంక్షన్, రింగ్ రోడ్డు జంక్షన్, కనుకపరమేశ్వరి కోవెల జంక్షన్, మహిళా ప్రాంగణం, కలెక్టరేట్, గాంధీ పార్క్, కస్పా హై స్కూల్, ప్రేమ సమాజం, విటి అగ్రహారం తదితర ప్రాంతాల్లో మహాత్మా గాంధీ విగ్రహాలకు స్థానిక టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్రమ అరెస్టుకునిరసనగా చంద్రబాబు, భువనేశ్వరి చేపట్టిన దీక్షకు మద్దతుగా తెలుగు మహిళలు అశోక్‌బంగ్లా వద్ద దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ దురదృష్టవశాత్తు ప్రజాస్వామ్యంతో సంబంధం లేని ప్రభుత్వం రాష్ట్రంలో రావడంతో తమ నాయకుడిని కారణం లేకుండా అరెస్టు చేశారని అన్నారు. రాజ్యాంగం, చట్టాలు అమలు కావాలని, దౌర్జన్యాలు నశించాలని అన్నారు. మంత్రులు రాళు విసురుతారు, చొక్కాలు విప్పుతారు, బూతులు మాట్లాడుతారు.. వారిపై ఒక కేసు కూడా ఉండదు, శాంతియుతంగా ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారు అని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరీ టెంపుల్ దగ్గర గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు విడుదల కావాలని కన్యకా పరమేశ్వరీ టెంపుల్, అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం, చీపురుపల్లి కనక మహాలక్ష్మి దేవి ఆలయంలో పూజలు చేశారు.

నెల్లిమర్ల : నెల్లిమర్లలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. గాంధీజి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుల సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, కడగల ఆనంద్, మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్‌రావు, పతివాడ అప్పలనారాయణ, కర్రోతు సత్యనారాయణ పాల్గొన్నారు.

డెంకాద: మండలంలోని జొన్నాడ జంక్షన్ వద్ద టిడిపి రిలే నిరాహారీ దీక్షలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర రావు, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్‌రావు, పతివాడ తమ్మినాయుడు, మహంతి శంకర్రావు, కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్యా సాగర్ నాయుడు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని దెందేరు గ్రామంలో టిడిపి ఆధ్వర్యాన నిరాహార దీక్ష చేపట్టారు. దీనికి జనసేన నాయకులు మద్దతిచ్చారు.

బొబ్బిలి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన దీక్షా శిబిరం వద్ద గాంధీకి టిడిపి నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం 20వ రోజు దీక్షలను టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి ప్రారంభించారు. కోటలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన దీక్ష చేపట్టారు. తనకు అనారోగ్యం కారణంగా కోటలో ఒంటరిగా దీక్ష చేసినట్లు బేబినాయన చెప్పారు.

వేపాడ : వేపాడ మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, బానాది ఎంపిటిసి గొంప తులసి, సేనాపతి గణేష్, ఎం.అప్పలసూరి, జి.నాగరాజు, సిరికి రమణ పాల్గొన్నారు.

బ్రాహ్మణికి గణపతినీడి సంఘీభావం

విజయనగరం కోట : రాజమండ్రిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ భార్య బ్రాహ్మణికి గణపతినీడి శ్రీనివాసరావు దంపతులు సోమవారం కలిసి సంఘీభావం తెలిపారు. విజయనగరం నుంచి 40 మంది మహిళలతో చంద్రబాబుకు మద్దతుగా రాజమండ్రికి బస్సు యాత్ర నిర్వహించారు. టిడిపి క్యాంప్ ఆఫీస్ వద్ద నారా బ్రాహ్మణిని కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండించారు. కార్యక్రమంలో టిడిపి విజయనగరం పార్లమెంట్ అధ్యక్షురాలు కె.విమలా రాణి, తెలుగు మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి పత్తిగిల్లి సూర్యకుమారి, రాష్ట్ర క్రిష్టియన్ సెల్ కార్యదర్శి సిహెచ్ సుహాసిని, సోషల్ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్ రెడ్డిపల్లి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

5న బహిరంగ సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కొత్తవలస

ఈ నెల ఐదో తేదిన విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గాడి అప్పారావు కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఉత్తరాపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో పి.వి.రమణ, పి.సూర్యనారాయణ, ఎన్.నర్సింగరావుట, కె.పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిదిద్దుకుంటే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

క్షణికావేశంలో చేసిన తప్పులను సరిచేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్, జూనియర్ సివిల్ జడ్జి సరస్వతమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య జోసెఫిన్ అన్నారు. స్థానిక సబ్‌జైల్లో సోమవారం ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలిసీ తెలియక చేసిన తప్పులను సరి చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఖైదీలకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం పెట్టాలని జైలు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గంటి గోపాలకృష్ణ శర్మ, న్యాయవాదులు దీపావల్లి, ప్రసన్నకుమార్, జైల్ సూపరింటెండెంట్ పాత్రో పాల్గొన్నారు.

సుపథ సేవలు ప్రశంసనీయం

ఎమ్మెల్సీ రఘురాజు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

20 ఏళ్లుగా నిర్వహిస్తున్న సుపథ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సుపథ 20వ వార్షికోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్, శ్లోకాలు, పద్యాలు, భాగవతం, రామాయణం వంటి పలు అంశాలపై సోమవారం పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి బహుమతులు అందించారు. సుపథ వ్యవస్థాపకులు యువిఎన్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ కూర్మారావు , పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమాకుమారి, సుపథ ఆశ్రమ నిర్వాహకులు శ్రీహరిశర్మ పాల్గొన్నారు.



కెజిబివి సిబ్బందికి దుస్తులు అందజేస్తున్న గొంప వెంకటరావు

గొంప కృష్ణ ఉదారత

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ఎన్ఆర్ఐ గొంప కృష్ణ మరోమారు మంచి మనసు చాటుకున్నారు. కృష్ణ ఆర్థిక సాయంతో బక్కునాయుడుపేట వద్దనున్న కెజిబివిలో నాన్ టీచింగ్ సిబ్బందికి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు సోమవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.నాగరాజు, సిరికి రమణ, అప్పారావు పాల్గొన్నారు.

నందబలగలో గడపగడపకు..

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నందబలగ సచివాలయ పరిధిలో రెండు రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు చేస్తున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ నాయకులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, మండల అధ్యక్షులు సత్యంనాయుడు, ఎఎంసి చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపిపి ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు అతివేగంగా నడిపితే కేసులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వాహనాలు అతివేగంగా నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పి.నారాయణరావు హెచ్చరించారు. సోమవారం ఆయన స్థానిక రామతీర్థం జంక్షన్‌లో వాహనాల తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన దారులు అతివేగంగా నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేయడమే కాకుండా జరిమానా విధిస్తామన్నారు. రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని, మైనర్లకు వాహనం ఇస్తే తలిదండ్రులు భాధ్యత వహించాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

పత్ర ద్రావణంతో చీడపీడల నివారణ

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పలు పత్రాలతో తయారు చేసిన ద్రావణంతో చీడపీడలు, తెగుళ్లు నశిస్తాయని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి కొప్పాక లక్ష్మి తెలిపారు. మండలంలోని కందివలస యూనిట్ గుణపరెడ్డిపేట గ్రామంలో రైతులు, మహిళా సంఘ సభ్యులతో సామూహికంగా సోమవారం ఈ కషాయాన్ని తయారు చేయించారు. కషాయం తయారీ విధానం, దీనివల్ల ప్రయోజనాలను ఆమె వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి తగ్గటమే కాకుండా నేల సారవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి దీప్తి, వ్యవసాయ శాస్త్రవేత్త కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో యువకుల చేరిక

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పెంట గ్రామానికి చెందిన యువకులు సోమవారం జనసేన పార్టీలో చేరారు. జనసేన కార్యాలయంలో యువతకు రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబు పాలూరి మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనతో విసుగు చెందిన యువత జనసేన వైపు చూస్తున్నారన్నారు. జనసేనతో రాష్ట్రానికి, యువతకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎల్.రమేష్, పి.రాజా, ఆర్.కిరణ్, ఎం.రవి, సతీష్, రమ్య, తదితరులు పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకున్న వ్యక్తులు, ట్రాక్టర్ల వద్ద ఎస్ఐ హరిబాబు


నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని చంపావతి నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు సోమవారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆనందపురం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుధంగా ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

ఎమ్మెల్యే అప్పలనరసయ్య



బొబ్బిలి.. గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జెడ్‌పిటిసి గారు తౌడు, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, వైసిపి నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ, ఎంపిపి బెల్లాన జ్ఞాన దీపిక, జెడ్‌పిటిసి గార తవుడు నివాళులర్పించారు. 22 మంది పారిశుధ్య కార్మికులను ఎంపిపి, జెడ్‌పిటిసి ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరవ కొండమ్మ ఉపసర్పంచ్ కర్రీ రామనాయుడు పాల్గొన్నారు. పురిటిపెంటలో సర్పంచ్ ఎస్.విజయలక్ష్మి, ఉప సర్పంచ్ మండల సురేష్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ కె.కిషోర్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రావాడ సత్యనారాయణ.. గాంధీకి నివాళులర్పించారు.

కొత్తవలస : కొత్తవలస తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు పాల్గొన్నారు.

మెంటాడ : మెంటాడ గ్రంథాలయంలో గాంధీ చిత్రపటానికి శాఖా గ్రంథాలయ అధికారి మరడాన త్రినాథరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో గంద్రేటి అప్పారావు, మీసాల అప్పలనాయుడు, గోవింద, నాగరాజు పాల్గొన్నారు.

తెర్లాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, పలు చోట్ల ఎంపిపి ఎన్.ఉమాలక్ష్మి, వైస్ ఎంపిపి సత్యనారాయణ నివాళులర్పించారు. పెరుమాళిలో పాత్ ఫౌండేషన్ ఆధ్వర్యాన గాంధీ జయంతిని నిర్వహించారు. గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ బెనర్జీ పాత్రుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముప్పిడి వెంకటరమణను గ్రామస్తులు సన్మానించారు. పెరుమాలి, జగన్నాథవలస సర్పంచులు జి.వెంకట్రావు, అప్పల నరసింహరాజు పాల్గొన్నారు. అరసబలగ సర్పంచ్ కె.సాయిరాం గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లకు సన్మానం చేశారు.

లక్కవరపుకోట : శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వి రమణ ఆధ్వర్యాన గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గాంధీ విగ్రహాన్ని జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి యడ్ల కిషోర్ కుమార్ ఆవిష్కరించారు. తలారిలో వైసిపి మండల అధ్యక్షులు గుమ్మడి సత్యనారాయణ, లక్కవరపుకోట ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు, ఎల్.కోట మాజీ సర్పంచ్ జామి అప్పలరాజు.. గాంధీ విగ్రహాలకు నివాళ్లర్పించారు.

బొబ్బిలి : పట్టణంలో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జెసి రాజు, వి.శ్రీహరి, ట్రెజరర్ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ చిత్రపటాలను వనమిత్ర అధ్యక్షులు కె.కృష్ణదాసు చిన్నారులకు పంపిణీ చేశారు. మున్సిపల్, విద్యుత్తు శాఖ కార్యాలయంలో గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీ చిత్రపటాలకు లోక్ సత్తా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, జనసేన కార్యాలయంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి నివాళులర్పించారు.

వేపాడ : ఎంపిడిఒ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు జగ్గుబాబు, ఎపిఒ ఆదిలక్ష్మి నివాళులర్పించారు.

నెల్లిమర్ల : జరజాపుపేట ఎంపిపి పాఠశాలలో సాధన యువజన సంఘం ఉపాధ్యక్షులు బెల్లాన వెంకటరావు, సభ్యులు మద్దిల ఉమా మహేశ్వరరావు, బొద్దల శ్యామ్ సుందర్, రాజమండ్రి రాంబాబు, పసుమర్తి వెంకటరమణ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో విసి ప్రశాంత్ కుమార్ మహంతి.. గాంధీజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ పాల్గొన్నారు. జయంతిని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. టెక్కలి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

గుర్ల: గుర్లలో గాంధీ చిత్రపటానికి నాయకులు మంత్రి వెంకటరమణ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు శెట్టి తవుడు, మంత్రి పైడినాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణమూర్తి, జిల్లా రహదారుల భద్రతా కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి తిరుపతిరావు గాంధీ ఫొటోకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



లక్కవరపుకోట.. గాంధీ వేషధారణలో విద్యార్థులు



కొత్తవలస.. గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడుబండి, నాయకులు

మెరకముడిదాం: మండలంలోని పెద్దమంత్రిపేట ఎస్ ఇండియా ఆధ్వర్యంలో పెద్దమంత్రిపేట, బైరిపురంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. బైరిపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఉన్న మహాత్మ గాంధీ విగ్రహానికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పప్పల విజయకుమారి, పప్పల క్రిష్ణ మూర్తి పూలమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఇండియా అధ్యక్షులు ఫార్మర్ ప్రొఫెషర్ డాక్టర్ హరశ్రీరాములు, పప్పల గ్రహణేశ్వరరావు, కెంగువ ధనంజయ, కందుల మళ్ళి ఖార్జునరావు, ఎస్ ఈశ్వరరావు, కందుల శ్రీను, ఎస్. వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జనార్ధన నాయుడు ఆధ్వర్యాన గాంధీ జయంతి నిర్వహించారు.మహనీయుల ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు.మహాత్మా గాంధీ ,లాల్ బహుదూర్ శాస్త్రి జయంతులను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉడా కాలనీఫేజ్ 3లో కాలనీ అసోసియేషన్, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఫేజ్ 3 పార్క్ లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు గౌరీ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో వైస్ ప్రెసిడెంట్ మోహన్‌దాత, వాకర్స్ సెక్రటరీ చిరంజీవ రావు, వాకర్స్ సెక్రటరీ నారాయణరావు, సభ్యులు జాన్ విక్టర్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ తిరుపతి నాయుడు, సోషల్ వర్కర్ జగన్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యాన...

జిల్లా పోలీసు కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్‌పి అస్మా ఫర్హీన్ మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో శాంతియుత స్థాపనకు మహాత్ముడు చూపిన అహింసా మార్గం, సెక్యులరిజం ఆచరించాల్సిన మార్గాలన్నారు. ఎస్ఐబి ఎఎస్‌పి ఎస్.వెంకటరావు, డిఎస్‌పి ఆర్.గోవిందరావు, దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నేతల అసభ్యకర పదజాలం సమాజానికి నష్టం


సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ



సభలో మాట్లాడుతున్న మాజీ జెడి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - జామి

ప్రస్తుతం రాజకీయ నాయకులు వాడుతున్న అసభ్యకర పదజాలం పిల్లలపైనా, సమాజంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. మంచి ఆలోచనలతో దార్శనిక రాజకీయాలు చేయాలని సూచించారు. మండలంలోని జాగారం గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మహాత్ముని విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ముందుగా గ్రామస్తులు, విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అనంతరం చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. మీడియా వ్యక్తులు కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేసే నాయకులను బహిష్కరించాలని సూచించారు. రాజకీయాలకు దూరంగా ఉండాలనుకోవడం, ఓటు వినియోగించక పోవడం ప్రజలకు, సమాజానికి మంచిది కాదన్నారు. 100 శాతం ఓటు హక్కు నమోదైనప్పుడు ఓటు బ్యాంకు రాజకీయాలకు తావుండదని చెప్పారు. జనం యాంత్రికంగా తయారు కాకుండా మంచి ఆలోచనలతో సమాజాన్ని మార్చాలని పిలుపునిచ్చారు. అందుకు పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. తాను వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనన్న జెడి... చంద్రబాబు అరెస్టు, కేసు అంశాలు న్యాయస్థానాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బీశెట్టి బాబ్జి మాట్లాడుతూ రాజకీయాల్లో మంచి ఆలోచనలతో, సమాజం పట్ల అవగాహనతో పనిచేసే నాయకులను ప్రజలు తప్పకుండా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు మరిచర్ల కృష్ణ, మాతృభూమి సేవా సంఘం నాయకులు గోపాలరావు, ఎంపిడిఒ సతీష్, యాదవ సంఘం నాయకులు శేఖర్ యాదవ్, స్వామీజీ, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంకు విరాళాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థి ఉప్పాడ సూర్యనారాయణ

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సాయం

ప్రజాశక్తి - భోగాపురం

చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం వైసిపి మండల అధ్యక్షులు, పూర్వ విద్యార్థి ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి రూ.50వేలు విరాళాన్ని అందించారు. భోగాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చదువుకున్నానని పూర్వ విద్యార్థులంతా కలిపి రూ.50 వేలు, తాను మరో రూ. 50 వేలు కలిపి మొత్తం లక్ష రూపాయలను విరాళంగా పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. చదువుకున్న పాఠశాలకు రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో తమవంతు సాయం అందించామని సూర్యనారాయణ తెలిపారు.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

ప్రజాశక్తి-బొబ్బిలి

అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి అక్కడికి వెళ్లి పింఛను అందజేసి వాలంటీర్ మానవత్వాన్ని చాటుకున్నారు. మున్సిపాలిటీలోని 24వ వార్డుకు చెందిన ముగడ శ్రీను అనారోగ్యంతో సాలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వాలంటీర్ గండి రాణి ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు. దీంతో వాలంటీర్ రాణిని పలువురు అభినందిస్తున్నారు.

పంటల నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామారావు

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రతీ పంటను తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.టి.రామారావు రైతులకు సూచించారు. సోమవారం మండలంలో కొండకెంగువ రైతు భరోసా కేంద్రాన్ని ఆయన సందర్శించి, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం ఆర్‌బికె ద్వారా రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేస్తుందన్నారు. అనేక రకాల రాయితీలు అందిస్తుందని తెలిపారు. నమోదు చేసుకున్న ప్రతి పంటను ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ఇకెవైసి తప్పనిసరి అన్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలు, సేంద్రియ ఎరువులు వాడకం వంటివి అవలంబించి వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకొని అధిక రాబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎడి శ్యామ్‌సుందర్, వ్యవసాయ అధికారి వెంకటయ్య, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్రానికి ఎందుకు జగనే కావాలి కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రానికి ఎందుకు జగనే కావాలి కార్యక్రమంపై కొత్తవలసలోని తన క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణలో ఆయన మాట్లాడారు. తండ్రి వైఎస్ఆర్ ఒక అడుగువేస్తే తనయుడు రెండు అడుగులు ముందుకు వేసి గాంధీజీ కలలు కన్న స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రానికి సువర్ణ పరిపాలన కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జి బొంతుల వెంకటరావు, గొరపల్లి రవి, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

సెట్విజ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

విజయనగరం కోట : గాంధీ జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్, ఎస్.కె.డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో కొత్త అగ్రహారం రోటరీ క్లబ్‌లో రక్తదానం నిర్వహించారు. శారద సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుడిశ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. సెట్విజ్ మేనేజరు జి.శ్రీనివాస రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షులు డి.ఉమా బాలాజీ, ప్రతినిధులు ఎం. అనిల్ కుమార్, సూర్య లక్ష్మి, జ్యోతి బచావత్, జి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల హోంగార్డు పి.ప్రకాష్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి పోలీస్ శిక్షణ కళాశాల సిబ్బంది సోమవారం 43 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పిటిసి ప్రిన్సిపాల్ ఆనందబాబు ఈ మొత్తాన్ని శిక్షణ కళాశాల సిబ్బంది నుంచి సేకరించి ప్రకాష్ కుమారుడు పి. మణికంఠకు అందజేశారు. అడ్మిన్ ఆర్, ఐ. కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటప్పారావు, హోంగార్డుల సంఘం అధ్యక్షులు పి. బంగార్రాజు, పిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భోగాపురం

ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి అనే దానిపై ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులతో ఈ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం, ఎందుకు ఆంధ్రాకి జగన్ కావాలి ఈ మూడు కార్యక్రమాలను ఏకకాలంలో పూర్తిచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మన ప్రభుత్వం చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లేందుకు ఇది ఒక చక్కటి అవకాశం అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపిపి రావాడ బాబు, ఎంపిడిఒ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, భాను, సుబోసన రావు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ డైరెక్టర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే

మత్స్యకార సొసైటీ డైరెక్టర్ మైలపల్లి నరసింహులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. ఇటీవలి ఆయన తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ముక్కాం గ్రామం వెళ్లి ఆయనను పరామర్శించారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డితో పాటు పలువురు నాయకులు పరామర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సంఘాలు కషి చేయడం చాలా గొప్ప విషయం అని ప్రముఖ వైద్యులు మాటూరు సతీష్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా క్వీన్ ఎన్ఆర్ఐ హాస్పిటల్ నిర్వాహణలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, శ్రీ వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేయిర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ప్రజలకు వైద్య శిబిరాలు వలన ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్,ప్రోజెక్టు చైర్మన్ మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, సంఘం కార్యదర్శి సముద్రాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'విక్టరీ' విద్యార్థుల శ్రమదానం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రంలో విక్టరీ పాఠశాల విద్యార్థులు సోమవారం శ్రమదానం చేశారు. కరస్పాండెంట్ ఆధ్వర్యాన వీధులన్నీ శుభ్రం చేశారు. దీంతో విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

విద్యుత్తు శాఖ కార్యాలయంలో ..

బొబ్బిలి : స్థానిక విద్యుత్తు శాఖ కార్యాలయంలో ఉద్యోగులు సోమవారం శ్రమదానం చేపట్టారు. కార్యాలయ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇఇ పూడి హరి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యంగా ఉండగలమన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.